క్లుప్తంగా

వైభవంగా గోవిందమ్మ పేరంటాల జాతర

వీరఘట్టం: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అచ్చెపువలస వద్ద వెలిసిన గోవిందమ్మ పేరంటాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు వీరఘట్టంతో పాటు సమీప గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బిస్కెట్లు నైవేద్యంగా సమర్పించడం ఇక్కడి ఆచారం. దీంతో భక్తులు కొబ్బరికాయ, అరటిపళ్లతో పాటు బిస్కెట్లను కూడా అమ్మవారికి సమర్పించారు. బోగాది అప్పారావు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మజ్జి గౌరమ్మ సంబరాలు


ముర్రాటలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలిసిన మజ్జి గౌరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాదీ ఉగాది రోజున అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు. ఈక్రమంలో మహిళా భక్తులు ముర్రాటలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రమాదకర మలుపు..



బలిజిపేట నుంచి వంతరాం వెళ్లే రోడ్డులో ప్రమాదకర మలుపులున్నాయి. ముఖ్యంగా చిలకలపల్లి వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్న వాహన చోదకులకు రోడ్డుపై ఎండబెడుతున్న పంటలు మరో సమస్యగా మారాయి. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు గాని, స్పీడ్‌బ్రేకర్లు గాని ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. – బలిజిపేట

భవితకు బాసట దిశగా అడుగులు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ బీ – పఢాయి బీ' అమలు
- శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- ప్రీ స్కూళ్లు మరింత మెరుగ్గా నిర్వహణ

గుమ్మలక్ష్మీపురం:

చిన్నారుల భవితను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మరో కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సంపూర్ణ ఆరోగ్యంతో పాటు భావి భారత విజ్ఞానం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బీ – పఢాయి బీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. చిన్నారులకు విద్యతో పాటుగా ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్ బీ –పఢాయి బీ కార్యక్రమం అమలు నిమిత్తం ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లు మొదలుకొని అంగన్‌వాడీ కార్యకర్తలకు దఫదఫాలుగా శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ ఎడ్యుకేషన్)పై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణను అందించారు.

708 అంగన్‌వాడీ కేంద్రాలలో అమలు

కురుపాం నియోజకవర్గంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 186 అంగన్‌వాడీ కేంద్రాలు, కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 316 అంగన్‌వాడీ కేంద్రాలు, కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 206 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలన్నింటిలో పోషణ్ బీ – పఢాయి బీ కార్యక్రమం అమలుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలు ప్రారంభించారు.


పోషణ్ బీ- పడాయి బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ (ఫైల్)


ఎల్విన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం-2లోని చిన్నారులు

నూతన విద్యా విధానంలో..

నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ శిక్షణ పొందిన కార్యకర్తలతో బాల్య సంరక్షణ విద్య అందజేయనున్నారు.

శిక్షణ ఇచ్చాం



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ బీ –పఢాయి బీ కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల్లోకి తీసుకొచ్చింది. దీని అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయడమే మా లక్ష్యం. – ఎస్.రాజ్యలక్ష్మి, భద్రగిరి సీడీపీఓ, గుమ్మలక్ష్మీపురం మండలం

ప్రారంభమైన జీడి పిక్కల కొనుగోళ్లు

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో ఈ సీజన్లో లభ్యమయ్యే జీడి మామిడి పిక్కల కొనుగోలు ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే జీడి పిక్కలు దిగుబడి అవుతుండటంతో వాటిని సేకరించే పనిలో జీడి రైతులు నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి పండుగ రోజైన ఆదివారం నుంచి స్థానిక వ్యాపారులు జీడిపిక్కలను కొనుగోలు ప్రారంభించారు. కిలో జీడి పిక్కలను రూ.150లుగా ధర నిర్ణయించి కొనుగోలు ప్రారంభించారు. పూత పిందె దశల్లో బాగున్నా.. దిగుబడులు మాత్రం ఈ ఏడాది ఆశాజనకంగా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జీడి పిక్కలు

మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



మండలంలో మొక్కజొన్న పొట్టల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పసుకుడి, సింగిడి, బిల్లుమడ, లివిరి, అనంతగిరి ప్రాంతాల్లో మొక్కజొన్న విస్తారంగా పండింది. దీంతో వ్యాపారులు నేరుగా ఆయా గ్రామాలకు చేరుకుని మొక్కజొన్న పొట్టలను కొనుగోలు చేస్తున్నారు. వీటి నుంచి గింజలు వేరుచేసి విత్తనాలు తయారుచేసి మళ్లీ విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం పలు లారీల్లో మొక్కజొన్న పొట్టలు తరలించారు. – భామిని

వైభవంగా ఉగాది వేడుకలు

- వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు
- 8 మంది అర్చక వేద పండితులకు సత్కారం

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వక్తలు ఆకాంక్షించారు. స్థానిక లయన్స్ కల్యాణ మంటపంలో నిర్వహించిన వేడుకలను కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన 29 మందికి పురస్కారాలు అందజేశారు. అలాగే 8 మంది వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీఎస్వీ మాధవ్‌రెడ్డి, మైలారపు సూర్య వెంకటరమణ, జేబీ తిరుమలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారుల నృత్యం

పురస్కారాలు..

వివిధ రంగాల్లో రాణించిన వారికి కలెక్టర్, ఎస్పీ, తదితరులు ఉగాది పురస్కారాలు అందజేశారు. నారంశెట్టి ఉమామహేశ్వరరావు (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత), బెలగాం భీమేశ్వరరావు (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత), గంటేడ గౌరునాయుడు (సాహిత్యం), తాడ్డి సతీష్ కుమార్ (జర్నలిజం), గడగమ్మ రామకృష్ణ (శాంతి), శీర జయరాం (అర్జున్ అవార్డు గ్రహీత), బెహరా ఉమామహేశ్వరరావు (సాహిత్యం), బుడితి బలరాంనాయుడు (సాహిత్యం), డాక్టర్ వైవీ పద్మజ (వైద్యం, సంగీతం), పెంటపాటి సూర్యారావు (వినియోగదారుల క్లబ్), బొండపల్లి వెంకటరమణ (ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ), సంకా గౌరీ శంకరరావు (సామాజిక సేవ), మాదా కృష్ణమూర్తి (సామాజిక సేవ), రామస్వామి (సామాజిక సేవ), సూర్ణ కాంతిగంటాయత్ (యోగా), కొమిరి కృష్ణమూర్తి (హెడ్ కానిస్టేబుల్), జేబీ తిరుమలాచార్యులు (వ్యాఖ్యానం), కనకల పైడిరాజు (క్రీడారంగం), డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు (ప్రకృతి వ్యవసాయం), గెంబలి గౌతమ్ (యువ శాస్త్రవేత్త, పార్వతీపురం), పల్లా పరిసినాయుడు (ప్రముఖ జాతీయ నఖచిత్ర కళాకారుడు), వెనిగండ్ల పద్మజ (జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు), ఎ. లక్ష్మణరావు (ఆశాజ్యోతి ఆశ్రమం), బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు శర్మ (ఆధ్యాత్మిక రంగం), తదితరులు పురస్కారాలు అందుకున్నారు.


పంచాంగ పఠనం చేస్తున్న వేమకోటి నరహరి శాస్త్రి

పండితులకు సత్కారం

దేవదాయ శాఖకు చెందిన వీరభద్ర స్వామి, (అర్చకుడు, సోమేశ్వరస్వామి ఆలయం, దేమునిగుంపా, కొమరాడ మండలం) బాలకృష్ణ పండా (అర్చకుడు, అభయ ఆంజనేయ స్వామి ఆలయం, కోన గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం), సింహదాటి శంకరరావు, (అర్చకుడు, కోదండరామాలయం, మరకొండ పుట్టి గ్రామం, మక్కువ మండలం), ధమరసింగు కనక లింగేశ్వరరావు (అర్చకుడు, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, కాశీపట్నం, మక్కువ మండలం), మండల చంద్ర శేఖరరావు (అర్చకుడు, శ్రీ సీతారామ స్వామి ఆలయం, కుమ్మరిగుంట గ్రామం, వీరఘట్టం మండలం), పేరుమల్లా త్రినాథాచారి (అర్చకుడు, శ్రీ కోదండరామలయం, కోన గ్రామం, మక్కువ మండలం), సిద్ధాంతం చిరంజీవులు (అర్చకుడు, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీపురం, పార్వతీపురం), శ్రీజ్యోష్యుల వీరభద్ర శర్మ (అర్చకుడు, వినాయక సమేత వీరంజనేయ స్వామి ఆలయం, బాసురు గ్రామం, పాలకొండ) లను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఉగాది సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. సమ్మేళనంలో పాల్గొన్న చావలి శేషాద్రి సోమయాజులు, చింతా అప్పల నాయుడు, మీసాల వెంకట గౌరీశంకరరావు, ఇల్లా ప్రసన్నలక్ష్మి, మల్లిపూడి జగదీష్, గొట్టాపు శ్రీనివాసరావు, బౌరోతు శంకరరావు, కిలపర్తి దాలినాయుడు, గుడ్ల అమ్మాజీ, జమ్మ బాబురావు, పళ్ల రోహిణీకుమార్, పొందూరు సుధాకుమార్, తదితరులను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం శ్రావణి నృత్య పాఠశాల విద్యార్థులు, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఏఎస్పీ అంకితా సురానా, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ పి. ధర్మచంద్రా రెడ్డి, జిల్లా అధికారులు ఎన్‌టీ నాయుడు, తమర్బ కొండల రావు, కె. చలపతిరావు, ఎ. మురళీధర్, టి. దుర్గా ప్రసాద్‌రెడ్డి, ఓ. ప్రభాకరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఆర్. కృష్ణవేణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌బీ రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్. మంచిపల్లి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


వేద పండితుడిని సత్కరిస్తున్న కలెక్టర్, తదితరులు


భీమేశ్వరరావును సత్కరిస్తున్న అధికారులు


ప్రముఖ జ్యోతిష్యుడు మురపాక కాళిదాసు శర్మయాజీని సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గ్రామాల్లో సందడే సందడి..

విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను వాడవాడలా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఇంటిల్లపాదీ తిని ఆస్వాదించారు. రైతులు తెల్లవారు జామునే లేచి కొత్త నాగళ్లతో పొలాలకు చేరుకుని ముహూర్తం ప్రకారం ఏరువాక చేపట్టారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కొత్త దుస్తులు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించి పంచాంగ పఠనంలో పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షాలు, పంటలు, ఆదాయ, వ్యయాలపై పండితులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్నారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో ఏరువాకకు వెళ్తున్న రైతులు


పాలకొండ: కోటదుర్గ ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న అర్చకులు


సీతంపేట: శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


గరుగుబిల్లి: పంచాంగాలను అందజేస్తున్న తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు సుధాకరశర్మ


పాలకొండ రూరల్: లుంబూరులో భజన పాటలు పాడుతున్న కళాకారులు


వీరఘట్టం: జగన్నాథస్వామి ఆలయంలో పంచాగ పఠనం చేస్తున్న శర్మయాజీ


పాలకొండ: కోటదుర్గ ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


గరుగుబిల్లి: నాగూరులో నాగళ్లతో రైతులు, యువత

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

గరుగుబిల్లి: పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు యువతకు, ప్రజలకు వివరించారు. మండలంలోని గొట్టివలసలో పౌరహక్కులపై అవగాహన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ సమాన హక్కులు కలిగి వుంటాయన్నారు. అన్ని మతాలకు, వర్గాలకు సమాన హక్కులుంటాయన్నారు. అంటరానితనం తదితర అంశాలను ప్రజలకు అవగాహన కలిగి వుండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులవివక్ష చూపితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ ఒక్కరూ అనుభవిస్తూ ఇతరులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

భక్తిశ్రద్ధలతో క్రైస్తవ సోదరుల ప్రార్థనలు


నాటికను ప్రదర్శిస్తున్న క్రైస్తవ దీక్షా సోదరులు

గరుగుబిల్లి: గుడ్‌ఫ్రైడే వరకు క్రైస్తవులు 45 రోజుల పాటు శ్రమల కాలంగా యేసుక్రీస్తు శిలువమీద పడిన శ్రమలను గుర్తించి వారి జీవితాల్లో ఉన్న కష్టాలను ఎదుర్కొనేందుకు గొప్ప అవకాశంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని ఎస్ఆర్‌పేట గ్రామంలో ఉన్న లూర్ధుమాత దేవాలయంలో పార్వతీపురం బెలగాం విచారణకు చెందిన లూక బృంద సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసుల యేసు క్రీస్తు బోధనలకు అనుగుణంగా తోటి వారికి సహాయ పడుతూ శాంతియుతంగా సమాజంలో మెలగాలని బోధించారు. క్రీస్తు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో పి.జయప్రసాద్, కె.తోమస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన జాతర

గుమ్మలక్ష్మీపురంలో ఉమాసహిత కైలాసనాథ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 25 నుంచి నిర్వహించిన పంచమ రాత్రి జాతర మహోత్సవం శనివారం రాత్రి (ఆదివారం వేకువజాము వరకు)తో ముగిసింది. ఈ మేరకు చివరి రోజు కావటంతో జాతరను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో జాతర ప్రదేశం కిక్కిరిసింది.

– గుమ్మలక్ష్మీపురం

బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల మధ్య చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. క్రీడాకారులను సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లుగా విభజించి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా సాగాయి. చిన్నారులు అయిన క్రీడాకారుల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు, క్రీడల పట్ల మక్కువ పెంచేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు చీఫ్‌కోచ్ శ్రీరాములు చెప్పారు. రెండు రోజులు పాటూ ఈ పోటీలు నిర్వహించి విజేతలకు రంజాన్ సందర్భంగా సోమవారం సాయంత్రం బహుమతులు ప్రధానం చేస్తామ ని తెలిపారు.